క్లుప్తంగా

ధర్మశ్రీ కుమార్తె స్వాతి విస్తృత ప్రచారం



ఓటర్లను అభ్యర్థిస్తున్న చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ కుమార్తె స్వాతి

రోలుగుంట: సంక్షేమ కార్యక్రమాలు, సుపరిపాలన వైఎస్సార్‌సీపీకే సాధ్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కుమార్తె స్వాతి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆమె శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. దీనిలో భాగంగా రోలుగుంట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మద్దు తాతబాబు, పార్టీ యువజన కమిటీ సభ్యులు మద్దు శివ, పిల్లి శ్రీను, తదితరులతో కలసి రోలుగుంట వీధుల్లో ఇంటింటా తిరిగారు. ఓటర్లను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. జనం మెచ్చిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం కొవ్వూరులో కూడా నిర్వహించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



కొమళ్లపూడిలో పోలీసులతో కవాతు చేస్తున్న ఎస్ఐ ఈశ్వరరావు

బుచ్చెయ్యపేట: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. శనివారం కొమళ్లపూడి, గంటికొర్లాం, బుదిరెడ్లపాలెం, కొండెంపూడి, కేపీ ఆగ్రహారం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చైతన్యవంతం చేస్తున్నారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించి అల్లర్లకు, వివాదాలకు దిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

రైవాడ కెనాల్‌లో నాచు తొలగింపు

కె.కోటపాడు: రైవాడ కెనాల్‌లో నాచు, పిచ్చి మొక్కలను తొలగించే పనులను జీవీఎంసీకి చెందిన లష్కర్లు నిర్వహిస్తున్నారు. కేఆర్‌పేట–ఉగ్గినవలస కెనాల్ మార్గంలో శనివారం వారు నీటి అడుగుభాగంలో పేరుకుపోయిన వీటిని తొలగించారు. జీవీఎంసీకి వెళ్తున్న 50 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వీటిని తొలగిస్తున్నట్లు చెప్పారు.

12 మంది వలంటీర్ల రాజీనామా



కార్యదర్శి కవితకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

మాడుగుల రూరల్: ముకుందపురం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న 12 మంది వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వీరి రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఆర్. కాశీ ప్రసాదరావుకు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఆర్. కవిత తెలిపారు.

సారా విక్రేతకు రిమాండ్

బుచ్చెయ్యపేట: చిన భీమవరంలో సారా విక్రేతను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. శనివారం స్థానికుల సమాచారం మేరకు తమ సిబ్బందితో గ్రామంలో తనిఖీ చేయగా, గొంతిన నాగేశ్వరరావు సారా విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి నుంచి ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

23,200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

రావికమతం: మండలంలోని గుమ్మాళ్లపాడులో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ఎస్ఐ ధనంజయ్ శనివారం తెలిపారు. ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితోపాటు దాడులు చేశామన్నారు. గ్రామ శివారు పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,200 లీటర్ల పులుపును, పెద్ద ఎత్తున సామగ్రిని ధ్వంసం చేశామన్నారు.

డెవలప్‌మెంట్ వాచ్

రాచ 'మార్గం'

మాడుగుల: రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన మాడుగుల నియోజకవర్గం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. గత టీడీపీ పాలనలో అధ్వానంగా రోడ్లు దర్శనమిచ్చేవి. ఇక్కడ అడుగుకో గుంత... రాళ్లు తేలిన రోడ్లుతో ప్రజలు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇక్కట్లు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వీటికి మహర్దశ పట్టింది. ఐదేళ్లు తిరగకముందే ఒక్కసారిగా వీటి రూపురేఖలు మారిపోయాయి. మట్టి రోడ్లు సైతం తారు రోడ్లుగా రూపాంతరం చెందాయి.

ఐదేళ్లలో చేపట్టినవి మచ్చుకు కొన్ని...

- మాడుగుల మండలం జాలంపల్లి పంచాయతీలో ఎల్. కృష్ణాపురం నుంచి కొండవీధి మీదుగా కామకూటం గిరిజన గ్రామానికి ఇంతవరకు కాలినడకనే వెళ్ల లేని పరిస్థితి. ప్రస్తుతం రూ.3.40 కోట్లతో నూతనంగా రహదారి నిర్మించారు. మూడు గిరిజన గ్రామాలకు ఎన్నోయేళ్ల నాటి కల ఫలించింది.
- కింతలి నుంచి ఘాట్‌రోడ్ జంక్షన్ వరకు గోతులమయంగా రోడ్డు ఉండేది. ప్రస్తుతం రూ.9 కోట్లతో రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో 40 గ్రామాలకు రహదారి సౌకర్యం కలిగింది.
- కింతలి వల్లాపురం మధ్యలో గొర్రి గెడ్డపై రూ.40 లక్షలతో నూతనంగా వంతెన నిర్మించారు. దీంతో నాలుగు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయాయి.
- మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవు గిరిజన గ్రామానికి కొండబాట ఉండేది. ప్రస్తుతం రూ.1.10 కోట్లతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈ గ్రామానికి దశాబ్దాల నాటి కల నెరవేరింది.
- బుచ్చెయ్యపేట మండలంలో రాజాం– తట్టబంద (ఆర్బీ) రోడ్డును రూ.4.45 కోట్లతో నిర్మించారు. దీంతో 20 గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం కలిగింది.



మాడుగుల మండలం జాలంపల్లి పంచాయతీలో ఎల్. కృష్ణాపురం నుంచి కొండవీధి మీదుగా కామకూటం వరకు నిర్మించిన రోడ్డు



కింతలి నుంచి ఘాట్‌రోడ్ జంక్షన్ వరకు నిర్మించిన రోడ్డు



కింతలి వల్లాపురం మధ్యలో గొర్రి గెడ్డపై నూతన వంతెన



మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవుకు వేసిన సీసీరోడ్డు



బుచ్చెయ్యపేట మండలంలో రాజాం-తట్టబంద(ఆర్బీ) రోడ్డు

జగనన్నకే సంక్షేమ పాలన సాధ్యం



చుక్కపల్లిలో ఓటర్లు, చిన్నారులతో ఈర్లె అనురాధ

- 7 గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ప్రచారం

చీడికాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చారని వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. తన ఎన్నికలు ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలోని చీడిపల్లి, అర్జునగిరి, చుక్కపల్లి, చెట్టుపల్లి, పెదగోగాడ, జి.కొత్తపల్లి గ్రామాల్లో ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు. మీ ఇంటి ఆడపడుచుగా ఆదరించి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో అనురాధకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ, నారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరామ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



అర్జునగిరిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

ఓట్ల కోసమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్

రోలుగుంట: రైతు బాంధవుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, భూములిచ్చేవాడే గాని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాదిరిగా దోచుకునేవాడు కాదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీశ్రీనివాస్ అన్నారు. చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు గెలుపు కోసం శుక్రవారం రాత్రి ఆయన బుచ్చింపేట, కె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఓట్ల కోసమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చంద్రబాబు ఎల్లోమీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గైరంపేట నుంచి బీబీపట్నం వరకు, అక్కడ నుంచి వడ్డిప వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ నిధులు మంజూరు చేయించారన్నారు. కాంట్రాక్టర్ అలసత్వం వల్ల పనులు చేయకపోవడంతో ఇచ్చిన హామీ, మాటకు కట్టుబడి ఎమ్మెల్యే ఈ రోడ్డు పనులు చేయించడం అభినందనీయమన్నారు.



వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్

వైఎస్సార్‌సీపీకి యాదవుల మద్దతు

ఎమ్మెల్యే ధర్మశ్రీతో ఆ సంఘాల ప్రతినిధుల భేటీ

చోడవరం: వైఎస్సార్‌సీపీకే సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని యాదవ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీతో వారంతా భేటీ అయ్యారు. 35 ఏళ్లుగా యాదవులను తెలుగుదేశం పార్టీ నయవంచన చేసిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. తమ సామాజిక వర్గాన్ని కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుందని, ఎప్పుడూ సంక్షేమానికి కృషి చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక యాదవులకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యాదవులకు ఎంతో ప్రాధాన్యమిచ్చారని, అందుకే ఆయన వెంటనే తామంతా ఉన్నామని యాదవ సంఘ ప్రతినిధులు ముక్తకంఠంతో అన్నారు. విశాఖపట్నం మేయర్ పదవిని యాదవులకు ఇచ్చిందన్నారు. చోడవరం నియోజకవర్గంలో యాదవులకు డీసీఎంఎస్ చైర్మన్ పదవితోపాటు పార్టీలో క్రియాశీలక పదవులను ఇవ్వడం జరిగిందన్నారు. యాదవుల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో యాదవులంతా సమష్టిగా కృషి చేసి వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ధర్మశ్రీ కోరారు. నియోజకవర్గంలో యాదవ సంఘం భవనానికి 50 సెంట్లు స్థలాన్ని సమకూర్చడంతోపాటు నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గం యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొల్లి ప్రసాద్, రాష్ట్ర సంఘం ప్రతినిధి అల్లి రాజబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు , వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, బుచ్చెయ్యపేట మండలం అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్లు జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజు, సర్పంచ్ కూర్మదాసు మాలిబాబు, బర్ల శివ, బూరా రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ

ధర్మశ్రీ ప్రచారానికి జన నీరాజనం

14 గ్రామాల్లో హోరెత్తిన అభిమానం



అంకుపాలెం ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ



బెన్నవోలులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీకి చోడవరం మండల ప్రజలంతా నీరాజనం పలికారు. బెన్నవోలు, అంకుపాలెం, శ్రీరాంపట్నం, తిమ్మన్నపాలెం, చాకిపల్లి, కన్నంపాలెం, జన్నవరంకొత్తూరు, గాంధీ గ్రామం, నర్సయ్యపేట, లక్ష్మీపురం, దామునాపల్లి, ఖండిపల్లి, జీజేపురం, గవరవరం గ్రామాల్లో శనివారం ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రచారానికి పెద్ద సంఖ్యలో యువకులు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. పూలవర్షం కురిపించి, అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ధర్మశ్రీ వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీ ఇంటికి ఎటువంటి లంచాలు లేకుండా సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఐదేళ్లలో ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ నెల 13న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. వలంటీర్లను పనిచేయకుండా చంద్రబాబునాయుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం వల్లే పింఛన్‌దారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎన్నికల అనంతరం మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల ద్వారానే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేస్తామన్నారు. ఈ ప్రచారంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులంతా పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలు తప్పవు

ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు

బుచ్చెయ్యపేట: తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే 2014 నాటి కష్టాలు తప్పవని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. శనివారం ఆయన చింతపాక, పెదమదీన తదితర గ్రామాల్లో పార్టీ మండల నాయకులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబునాయుడు పచ్చి మోసగాడని గతంలో డ్వాక్రా, రైతు రుణ మాఫీ చేస్తామని చేయలేదని, నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి అని, ఇంటికొక ఉద్యోగం అని చెప్పి అందరిని మోసం చేశాడని పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి తెలిపారు. ఇప్పుడు సీఎం పదవిపై యావతో లేనిపోని వాగ్దానాలు చేసి ప్రజల్ని మరలా మోసం చేయాలని చూస్తున్నాడన్నారు. వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, మండల సచివాలయ కన్వీనర్ కె. అప్పలనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, మాజీ జెడ్పీటీసీ బుదిరెడ్ల అప్పారావు, సర్పంచ్‌లు గొలజాన శ్రీను, గోపిశెట్టి శ్రీను, కె. వెంకటరావు, నాయకులు జోగా కొండబాబు, భూషణం, ఆనంద్, గుద్దేటి శ్రీను, గంట్ల అప్పలనాయుడు, సంజీవరావు, బాబూరావు పాల్గొన్నారు.



చింతపాకలో ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు

టీడీపీ కుట్రతో అవే కష్టాలు..

- నాల్గో రోజు బ్యాంకుల వద్ద పాట్లు
- చంద్రబాబుపై దుమ్మెత్తిపోస్తున్న వృద్ధులు



మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామీణ బ్యాంకు వద్ద పింఛను కోసం వేచివున్న లబ్ధిదారులు

బుచ్చెయ్యపేట/రోలుగుంట/కె.కోటపాడు: టీడీపీ నాయకులు ఫిర్యాదుతో వలంటీర్ల సేవలు నిలిచిపోవడంతో అన్ని గ్రామాల్లోనూ రెండు నెలలుగా అవ్వాతాతలు పింఛన్ నగదు పొందడానికి నానా అవస్థలు పడుతున్నారు. 2019 నుంచి ఈ ఏడాది మార్చి వరకు తెల్లవారే ఇంటి వద్ద హాయిగా పింఛన్ తీసుకున్న పింఛన్‌దారులకు గత నెల, ఈ నెల పింఛన్ కష్టాలు గత టీడీపీ పాలనను గుర్తుకు తెస్తున్నాయి. ఆ పార్టీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరించడంతో ప్రస్తుతం మండుటెండలో ఐదు నుంచి పదికిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు. అక్కడ గంటల కొద్దీ అవస్థలు పడుతూ పింఛన్ నగదు పొందుతున్నారు. తమ కష్టాలకు కారణమైన టీడీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు.....

అన్ని గ్రామాలవారు అష్టకష్టాలు పడి రోలుగుంట ఏపీజీవీబీకి రావాల్సి వస్తోంది. ఇక్కడ సీఎస్‌పీ కేంద్రాల వద్ద గంటలకొద్దీ ఉంటే చివర్లో ఆధార్ అనుసంధానం కాలేదని, వేలిముద్ర పడకపోవడం తదితర సాంకేతిక సమస్యలతో సరిచేసుకోవడానికి వెనుదిగాల్సి వస్తోంది. వలంటీరు ఒక రోజులోనే తన పరిధిలో సునాయాసంగా పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేయడం, ఎవరైనా అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరితే అక్కడికి వెళ్లి ఇచ్చేవారు. తెలుగుదేశం పార్టీ నాయకుల ఫిర్యాదుతో పింఛన్‌దారులకు పాత కష్టాలు ప్రారంభమయ్యాయి. దీంతో వారంతా జగన్‌బాబు ప్రభుత్వమే రావాలని, మరలా తమ సేవలు పునరుద్ధరణ చేయాలని కోరుతున్నారు.

ఇంటికి వెళ్లి పింఛన్ల అందజేత

మాడుగుల రూరల్: మండలంలో 3,015 మందికిగాను 2,866 మందికి సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారని ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదురావు శనివారం తెలిపారు. నగదు నిల్వలులేని బ్యాంకు ఖాతా రద్దు అవుతుందని, అటువంటి ఖాతాదారులకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కె.జె.పురం గ్రామీణ వికాస్ బ్యాంకు ద్వారా 500 మందికి పైగా ఖాతాదారులకు పింఛన్లు అందజేసామని మేనేజర్ సాయిసుధాకర్ తెలిపారు.

గత టీడీపీ పాలనలో పింఛన్ల పరిస్థితి ఇదీ!

గత టీడీపీ పాలనలో వృద్ధులకు పింఛన్ కావాలంటే, ఎవరైనా చనిపోతేనే కొత్తవారికి అవకాశమిచ్చేవారు. దానికోసం పైరవీలు, ప్రలోభాలు చేసేవారికి ఇచ్చి అర్హులైన అవ్వాతాతలను మొండిచేయి చూపేవారు. పైగా పింఛన్ ఏ తేదీన ఎక్కడ? ఎప్పుడు ఇచ్చేవారో తెలిసేది కాదు. ఇచ్చిన పింఛన్ నగదులో కొంత కోత ఉండేది.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వృద్ధుల కష్టాలు ఒక్కసారిగా తొలగిపోయాయి. ఎంతమంది దరఖాస్తు చేస్తున్నా, అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు చేసేవారు. వీటి కోసం పంచాయతీల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయకుండా వలంటీర్ల ద్వారా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి తలుపుతట్టి అందించేవారు.



బుచ్చెయ్యపేట: సీతయ్యపేట స్టేట్ బ్యాంకులో పింఛన్ నగదు కోసం వృద్ధులు పాట్లు



రోలుగుంట సీఎస్పీ కేంద్రం వద్ద పింఛన్ కోసం వేచిఉన్న పింఛన్‌దారులు

చంద్రబాబుకు వస్తాయి పాట్లు



వృద్ధాప్యంలో మాకు ఇంటికొచ్చి అందిస్తున్న పింఛన్ డబ్బుల రాకుండా చేస్తున్న చంద్రబాబుకు వస్తాయి మాలాంటి పాట్లు. అతను ముసలోడు అవుతున్నాడు కదా. మాలాంటోళ్ల ఉసురు తగులుతుంది. వేసవిలో బ్యాంకుల చుట్టూ తిరగాలంటే మాలాంటి ముదుసలి వారికి అవుతుందా? అధికారులు ఆలోచించి మా బాధలు తెలుసుకుని ఇంటి వద్దే పింఛన్ డబ్బులు అందించాలి. – ఎల్లపు సింహాచలం, వృద్ధురాలు, విజయరామరాజుపేట, బుచ్చెయ్యపేట మండలం

మోకాళ్ల నొప్పితో ఎలా వెళ్లాలి



వయస్సు పైబడటంతో నాకు మోకాళ్ల నొప్పులు, లేచి నిలబడటమే కష్టంగా ఉంది. అలాంటిది పింఛన్ డబ్బులు కోసం ఇతర గ్రామాల్లో బ్యాంకులకు వెళ్లి తీసుకోవాలని చెబితే మేం ఎలా వెళ్లగలం? జగన్‌బాబు అందిస్తున్న పింఛన్ డబ్బులు మాకు వలంటీర్ల ద్వారానే ఇంటి వద్దే ఇవ్వాలి. – బావిశెట్టి మాణిక్యం, వృద్ధురాలు, లోపూడి, బుచ్చెయ్యపేట మండలం

చంద్రబాబు కుట్రతోనే ఇక్కట్లు



పింఛన్ల సొమ్ము గత నెల సచివాలయాలకు, ఈ నెల బ్యాంకులకు వెళ్లి తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది వరకూ వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ప్రతి నెలా ఒకటినే ఇస్తుండేవారు. వారిపై చంద్రబాబు ఫిర్యాదు ఇవ్వడంతో మాకు కష్టాలు వచ్చాయి. అసలే ఎండలు కావడంతో బ్యాంకుకు వెళ్లడం ఇబ్బందిగా ఉంది. రెండు రోజుల నుంచి తిరుగుతున్నా.. – గౌదు చింతల్లి, వృద్ధురాలు, చౌడువాడ, కె.కోటపాడు మండలం

వైఎస్సార్‌సీపీ పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి



కాశీపురంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల: వైఎస్సార్‌సీపీ పాలనలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. శనివారం ఆయన తాటిపర్తి పంచాయతీ శివారు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ శివారు కాశీపురం, బిళ్లలుపాలెం, గరికబంద, లక్ష్మీంపేట, ద్వారకానగర్, చిన కూర్మాం, పెద కూర్మాం, తదితర గ్రామాల్లో ఆయన ఇంటింటికి తిరిగారు. డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కృషితోనే మాడుగుల నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధలకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ అల్లంకి వెంకట గౌరీదేవి, మాజీ సర్పంచ్ అల్లంగి సంజీవిరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.